


PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | గురువారం 30, జులై 2026 | సంపుటి :1 సంచిక : 204 | పేజీలు : 8 , వెల.2.00

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు

# లోక్‌సభ ఆమోదం



## అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

## అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే బిల్లు లక్ష్యం

## పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష

## రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లు

పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించింది.

వార్త 2లో





'విద్యార్థుల నిరసనపై

## కేంద్రం మూర్ఖంగా వ్యవహరించింది'..

లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిల్లుపై మాట్లాడుతూ.. పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు.విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు.

2

2



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై

## కేసును మూసేసిన సుప్రీంకోర్టు

బొగ్గు గనుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న క్రిమినల్ కేసును, ఆయనకు జారీ చేసిన సమన్ల ఉత్తర్వును దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రత్యేక కోర్టు గతంలో జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసింది.

2



## రైతు నేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నేత అశుతోష్ భేటీ.. సమష్టి పోరాటానికి ప్రయత్నాలు

రైతులు, విద్యార్థులు కలిసి మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ప్రకటించింది. ఇందుకోసం రైతులు, విద్యార్థులు, యువతతో కూడిన సంయుక్త వేదిక ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు వెల్లడించింది.

బంగాళాఖాతంలో

## మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'..

హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు.



2



## 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..

వార్త 2లో

'సర్' ప్రక్రియను

## వేగవంతం చేయాలి: భట్టి విక్రమార్క



2

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు.



2

## హైడ్రాపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

హైడ్రాపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

## అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

## అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే బిల్లు లక్ష్యం

## పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష

## రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లు

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి



పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది.

# 'విద్యార్థుల నిరసనపై కేంద్రం మూర్ఖంగా వ్యవహరించింది'.. లోక్‌సభలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిల్లుపై మాట్లాడుతూ.. పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు.

### రాహుల్ ప్రసంగంపై బీజేపీ ఎంపీల అభ్యంతరం..

లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. విద్యార్థుల ఆందోళన అంశంపై సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపయోగించిన ఓ పదం వివాదాస్పదంగా మారింది. దీనిపై అధికార పక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు.

### కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకున్నారు: రాహుల్

బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై కేసును మూసేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

బొగ్గు గనుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న క్రిమినల్ కేసును, ఆయనకు జారీ చేసిన సమన్ల ఉత్తర్వును దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రత్యేక కోర్టు గతంలో జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు ఇతరులకు విచారణ సంస్థ క్లీన్ చిట్ ఇస్తూ సమర్పించిన క్లోజర్ నివేదికలను సుప్రీంకోర్టు ఆమోదించింది. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టులను తోసిపుచ్చి, ట్రయల్ కోర్టు మన్మోహన్ సింగ్‌కు సమన్లు జారీ చేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'విచారణ సంస్థల నివేదికల స్వీకరణపై ఈ కోర్టు గతంలో వెలువరించిన మార్గదర్శకాల ఆధారంగా చూస్తే, సీబీఐ అందించిన క్లోజర్ రిపోర్టులను తోసిపుచ్చి స్పెషల్ జడ్జి కేసును విచారణకు స్వీకరించడానికి ఎటువంటి బలమైన కారణం కనిపించడం లేదు. అందుకే మేము ఈ అప్పీల్‌ను అనుమతిస్తూ కేసును క్లోజ్ చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# రైతు నేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నేత అశుతోష్ భేటీ.. సమష్టి పోరాటానికి ప్రయత్నాలు

ఇంటర్నెట్ డెస్క్:

రైతులు, విద్యార్థులు కలిసి మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ప్రకటించింది. ఇందుకోసం రైతులు, విద్యార్థులు, యువతతో కూడిన సంయుక్త వేదిక ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో సీజేపీ ప్రతినిధి అశుతోష్, ఇతర విద్యార్థి నేతలు మంగళవారం భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) నాయకుడు రాకేశ్ టికాయత్‌తో పాటు ఇతర రైతు నేతలను కలిశారు. ఈ సమావేశంలో రైతులు, విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించే అంశంపై చర్చించారు. సమావేశం అనంతరం అశుతోష్ మాట్లాడుతూ.. 'దేశంలోని రైతులు, విద్యార్థులు, యువత కలిసి మోదీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల



నుంచి ప్రశ్నించేలా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలన్న తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని సీజేపీ ప్రతినిధులు రాకేశ్ టికాయత్‌ను కోరారు.

# 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..

న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. నేడు (బుధవారం) సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

# బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'.. కేటీఆర్‌పై తుమ్మల సెటైర్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర



ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి: భట్టి విక్రమార్క

ఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు(దీూా) బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

### 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది: మహేశ్ కుమార్ గౌడ్

'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏ(దీూా)లను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

### ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# హైడ్రాపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ,

హైడ్రాపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

### ఈనెల 31న ఎన్డీఎస్ఏ సమావేశం

కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

### మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం..

కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

### నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం కూలింది..

కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

### ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి

### రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

### నిర్ధేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి

### అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

**హైదరాబాద్,**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి



పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు
సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చేందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# ముడుమాల్ నిలువురాళ్ల పార్కు అభివృద్ధి

### శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట,**

చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని స్పష్టం చేశారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ అభివృద్ధి పనులు



పూర్తయితే ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు మరింత గుర్తింపు లభించడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు . ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ... ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని,యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. యునెస్కో శాశ్వత గుర్తింపు కొరకు కొన్ని సూచనలు ఇచ్చారని వాటిని పాటించి గుర్తింపు పొందేలా కృషి చేయాలన్నారు. ఇదివరకే మంత్రి వాకిటి శ్రీహరి గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇందుకు తగిన వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 400 పాఠశాలల హెడ్మాస్టర్లకు శిక్షణ ఇచ్చి దాదాపు 60 వేల మంది విద్యార్థులు మూడుమాల్ నిలువు రాళ్ళను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే 20 మంది టూరిస్ట్ గైడ్లను ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు తగిన మ్యాప్ తయారు చేయాలన్నారు. ప్రజలు భాగస్వాములై ఇక్కడి విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేలా అవగాహన కల్పించుకోవాలన్నారు. శాస్త్ర విజ్ఞానం రాకముందే 3 వేల సంవత్సరాల క్రితం నిలువురాళ్ల రూపంలో నక్షత్ర మండలాన్ని ఆనాడే రూపొందించారని తెలిపారు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో విశిష్టతను చాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రజావాణిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,**

ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2ఃఊఐ గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎ÷-లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార పక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పొంగులేటి ఆరా

### కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మంత్రి

**హైదరాబాద్,**

మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరా తీసారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిని పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

**ఆగస్టు 1న ప్రధాని చేతుల మీదుగా ఏఎస్ఆర్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం**

**2,703 ఎకరాల విస్తీర్ణం, రూ.4,727 కోట్ల ప్రాజెక్టు.**

**3,800 మీటర్ల రన్‌వేతొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం**

**500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ**

**ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం**

**అమరావతి,**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో మైలురాయి ఆవిష్కృతం కానుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే నెల నుంచి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఆగస్టు ఒకటో తేదీన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం వస్తున్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఈ ప్రాజెక్ట్ కీలకం కావడంతో ఈ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి కూటమి సర్కార్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన నగరాల సరసన చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో అదే స్థాయి ప్రమాణాలతో భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధమైంది. కేవలం విమాన ప్రయాణ కేంద్రంగానే కాకుండా.. పరిశ్రమలు, ఉపాధి, ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు కేంద్రబిందువుగా మారేలా అల్లూరి సీతారామ రాజు ఎయిర్ పోర్టుకు రూపకల్పన చేశారు. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భోగాపురం ఒకటి. నిర్మాణం ప్రారంభమైన కేవలం 31 నెలల్లోనే పనులు పూర్తి చేయడమే కాకుండా, మొదట నిర్ణయించిన గడువుకంటే దాదాపు ఐదు నెలల ముందే సిద్ధం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం?విజయనగరం?శ్రీకాకుళం జిల్లాల ఆర్థికాభివృద్ధికి, పర్యాటక రంగ విస్తరణకు, పారిశ్రామిక పెట్టుబడులకు, ఎగుమతులకు, లాజిస్టిక్స్‌కు, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలక మౌలిక వసతిగా మారనుంది. జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా పీపీపీ విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. మొత్తం 2,703.26 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. విమానాశ్రయం 2,203 ఎకరాలు, ఏవియేషన్ హబ్ 500 ఎకరాలు, ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీ 136 ఎకరాలు కేటాయించారు. విమానాశ్రయ పరిధిలో ఎయిర్‌సైడ్ డెవలప్‌మెంట్, సిటీ సైడ్ కమర్షియల్ డెవలప్‌మెంట్, రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారు. 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఈ విమానాశ్రయానికి ప్రధాన ఆకర్షణ. వైడ్‌బాడీ విమానాల కార్యకలాపాలకు అనుకూలంగా దీనిని రూపొందించారు. అంటే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్ లైనర్, ఎయిర్ బస్ ం330, ఎయిర్ బస్ ం340 వంటి భారీ ఎయిర్ క్రాఫ్టులు భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి రాకపోకలు సాగించగలవు. ఇక ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్, నావిగేషన్ ఎయిడ్స్, వంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు ఈ ఎయిర్ పోర్టులో అందుబాటులో ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ విమాన కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రమాణాలతో ఎయిర్‌సైడ్ మౌలిక వసతులను అభివృద్ధి చేశారు. భోగాపురం విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాడ్యులర్ విధానంలో అభివృద్ధి చేశారు. తొలి దశలో ఏటా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఉంటుంది. భవిష్యత్‌లో దశలవారీ విస్తరణ ద్వారా ఈ సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణించేలా విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ప్రయాణికుల రద్దీ పెరిగే కొద్దీ టెర్మినల్, ఎయిర్‌సైడ్, కమర్షియల్ మౌలిక వసతులను విస్తరించేందుకు వీలుగా ప్రాజెక్టును రూపొందించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు.

# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

**ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా**

**దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం**

**సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ**

**అమరావతి,**

కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది.

### వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు

ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని... ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యారోగ్య రంగంలో మరింత వేగంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరగాల్సి ఉందని తెలిపారు. కేన్సర్ తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

## సంపాదకీయం...

# మోడీ జీ.. ఇది జెన్ జీ!

ప్రస్తుతానికి పరిస్థితి సద్దుమణిగింది. రెండు మాసాలుగా ఈ దేశ విద్యార్థి యువజనులు చేస్తున్న ఆందోళనకు ఎట్టకేలకు కేంద్రప్రభుత్వం తలవంచక తప్పలేదు. ఆ మేరకు శనివారంనాడు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశంలో పరీక్షా పత్రాల లీకేజీకి, విద్యావ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, ఏర్పడి ఉన్న గందరగోళానికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా సమర్పించారు. ఇది భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పుణ్యమా అని ఏర్పడిన కాక్రోచ్ జనతా పార్టీ సాధించిన తొలి విజయం. ఈ పార్టీ దేశంలో రాజకీయాల్ని సరి చేయడానికో, అధికారంలోకి వచ్చి దేశ పరిస్థితులను చక్కదిద్దడానికో ఏర్పడింది కాదు. ఈ దేశంలోని విద్యార్థులు, యువకులు సరైన విద్య అందక, ఉపాధి అవకాశాలు లేక కొట్టుమిట్టాడుతున్న స్థితిలో వారిని అవమానించే విధంగా దేశ ప్రధాన న్యాయమూర్తి వారిని ఉద్దేశించి బొద్దింకలు, పరాన్నజీవులు అని చేసిన వ్యాఖ్యల పర్యవసానంగా ఒక వ్యంగ్య వ్యక్తీకరణగా ఏర్పడింది కాక్రోచ్ జనతా పార్టీ. అది ఇంతింతై వటుడింతై అన్నచందంగా ఏర్పడిన కొద్ది మాసాల్లోనే ఈ దేశంలో ఇక మాకు తిరుగులేదు అంటూ మూడవసారి అధికారంలోకి వచ్చిన కారణంగా అతి విశ్వాసంలో పడిన కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేట్టు చేసి భారత ప్రజాస్వామ్యం ఎంత బలమైనదో స్పష్టం చేసింది. తప్పులు జరగకుండా చూడటానికి. వీళ్ళు ప్రజలకోసం పనిచేసే ధర్మకర్తలు. ఎక్కడైనా తప్పులు జరిగితే ప్రజలు అడిగేదాకా ఆగకుండా వాటిని సరి చేసుకోవలసిన బాధ్యతగలవారు. అంతేగాని అధికారంలో ఉన్నాం కాబట్టి మేము ఏం చేయడానికైనా ప్రజలు మాకు ఓటు ద్వారా ఆమోదముద్ర వేశారని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. తన శాఖలో తప్పులు జరిగితే తాను ప్రత్యక్షంగా బాధ్యుడు కాకపోయినా పదవికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం స్వతంత్ర భారతదేశంలో కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కేవలం 9 సంవత్సరాలలో 1956లో అప్పటి రైల్వే శాఖ మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తన తప్పు లేకపోయినా ఒక రైలు ప్రమాదంలో 150 మంది మరణించినందుకు నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసిన విషయం గుర్తు చేసుకోవాలి. ఆ తర్వాత కూడా ఇటువంటి సందర్భాలు కొన్ని మనం చూసాం. 1958లో అప్పటి ఆర్థికమంత్రి టిటి కృష్ణమాచారి ప్రజల నుండి, రాజకీయ పక్షాలనుండి వచ్చిన ఒత్తిడి కారణంగా ముద్రా స్కాండల్ అనే ఒక బీమా పెట్టుబడుల కుంభకోణానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. 1962లో భారత్– చైనా యుద్ధకాలంలో భారతదేశపు సైనిక సన్నద్ధత మీద వచ్చిన విమర్శల కారణంగా ఆనాటి రక్షణ మంత్రి వికె కృష్ణ మీనన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. తర్వాత కాలంలో ముంబై ఉగ్రవాద దాడుల నేపథ్యంలో 2008లో కేంద్ర హోం మంత్రిగా ఉన్న శివరాజ్ పాటిల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అలాగే 1992లో మాధవరావు సింధియా, 1999లో నితీష్ కుమార్, 2017లో సురేష్ ప్రభు ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. 2018లో ప్రముఖ సంపాదకుడు, ఎన్‌డీఏ ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల మంత్రిగా ఉన్న ఎంజే అక్బర్ కూడా మరో భిన్నమయిన కారణం వల్ల రాజీనామా చెయ్యక తప్పలేదు. 'మీ టూ' ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో లైంగిక వేధింపుల ఆరోపణల కారణంగా ఆయన ఈ రాజీనామా చేసారు. ఇలా రాజీనామాలు చేసిన వాళ్లంతా వ్యక్తిగతంగా తప్పులు చేశారని, అవినీతిపరులని అనుకోవాల్సిన పనిలేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కానీ, ప్రభుత్వానికి బాకాగా మారిన ఒక వర్గం గోదీ మీడియా కానీ ప్రారంభించిన స్తోత్రపాఠాలు విన్నాక ఈ సంఘటనలన్నీ గుర్తు చేయాల్సి వచ్చింది. యువతలో అసంతృప్తి ప్రజలు తమను ఎన్నుకొని పరిపాలించమని జీతభత్యాలు ఇచ్చి నియమించుకున్నప్పుడు ఆ ఉద్యోగం సక్రమంగా చేయలేనివారు స్వచ్ఛందంగా తొలగిపోవాలి. యువతను, విద్యార్థి లోకాన్ని రోడ్ల మీదకు తెచ్చి ఈ పరిస్థితి కల్పిస్తుంది.

# పార్లమెంట్‌కు అజిత్ దోవల్

**న్యూఢిల్లీ, జూలై 29**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో జాతీయ భద్రతా సలహాదారు (ఔాం) అజిత్ దొవల్ పార్లమెంట్‌కు చేరుకోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. బుధవారం నాడు లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై కీలక చర్చ జరుగుతోంది. మొదట ప్రతిపక్షాల ఆందోళనతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభం కాగా, యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ నడుస్తోంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ విషయంలో ఏం జరిగిందో బీజేపీ ఎంపీలు తమ పిల్లలను అడగాలన్నారు. యువత సెంటిమెంట్ ను కేంద్రం గౌరవించాలని, వారి జీవితాలను ప్రమాదంలోకి నెట్టవద్దని తన ప్రసంగంలో కేంద్రాన్ని కోరారు. అజిత్ దోవల్ పార్లమెంట్‌కు చేరుకోగానే సోషల్ మీడియాలో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆయన మంత్రులకు ఏదైనా కీలకమైన భద్రతా అంశంపై సమాచారం ఇవ్వడానికి వచ్చారా లేక ఏదైనా సున్నితమైన అంశంపై కేంద్రాన్ని అలర్ట్ చేయనున్నారా అని చర్చ మొదలైంది. అయితే, ప్రస్తుతానికి అందుతున్న సమాచారం ప్రకారం అజిత్ దొవల్ పార్లమెంట్‌కు రావడం పూర్తిగా రూటీన్ విజిట్ అని తెలుస్తోంది. దోవల్ పార్లమెంట్‌కు రావడానికి ఎలాంటి ప్రత్యేక భద్రతా ఇన్‌పుట్ లేదా అత్యవసర సమావేశంతో సంబంధం లేదని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.లోక్‌సభ సవరించిన ఎజెండా ప్రకారం నేడు సభలో పలు ముఖ్యమైన బిల్లులపై చర్చించి ఆమోదింపజేయాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. వీటిలో యాంటీ పేపర్ లీక్ సవరణ బిల్లు, జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026తో పాటు సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే సవరణ బిల్లు ఉన్నాయి. ప్రతిపాదిత బిల్లు ప్రకారం, ఒకవేళ జననం లేదా మరణం నమోదు ఒకట్రెండుళ్లు ఆలస్యంగా జరిగితే, దానికి జిల్లా మేజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ాఆఓ) లేదా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతి అవసరం. మరోవైపు, నమోదు రెండేళ్లకు పైగా ఆలస్యమైతే, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వుల తర్వాతే నమోదు చేయాలి. ఈ సవరణ ద్వారా నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు పూర్తిగా చెక్ పెట్టవచ్చని కేంద్రం భావిస్తోంది. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న జనన, మరణాల రికార్డులను ఒకే సెంట్రల్ డిజిటల్ డేటాబేస్‌కు అనుసంధానం చేయనున్నారు. ఇందులో సెంట్రల్ డేటాబేస్‌ను ఆధార్, ఓటర్ల జాబితా, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్ వంటి ప్రధాన ప్రభుత్వ పత్రాలతో కూడా అనుసంధానం చేస్తారు. దాంతో రికార్డుల పరిశీలన సులభతరం అవుతుంది. ప్రభుత్వ సేవలలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం చెబుతోంది. లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ సవరణ బిల్లుపై కూడా చర్చ కొనసాగుతుంది. ప్రభుత్వం ఈ బిల్లును సభ ఆమోదంపజేయాలని ప్రయత్నిస్తుంది.కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచడానికి సవరణ బిల్లును సభలో ప్రవేశపెడతారు. న్యాయవ్యవస్థలో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడం, కేసులను వేగంగా పరిష్కరించడం లక్ష్యంగా ఈ బిల్లును కేంద్రం తీసుకోస్తుంది. కేంద్ర మంత్రి అమిత్ షా జనన మరణాల నమోదు సవరణ బిల్లును ప్రవేశపెడతారు.

# హైదరాబాద్‌లో వానలే వానలు

**హైదరాబాద్, జూలై 29**

ఉత్తర తెలంగాణ ప్రాంతాలతో పాటు రాజధాని హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. జీహెచ్ఎంసీ పరిధిలో కురిసిన కుండపోత వర్షానికి రహదారులు జలమయమై వరద నీరు పొంగిపొర్లింది. దీంతో పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు మంగళవారం రాత్రి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ సమీపంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం దక్షిణ ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా పశ్చిమ–వాయవ్య దిశగా వెళ్లే అవకాశముంది. రుతుపవన ద్రోణి ఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉంది. ఈ ప్రభావంతో రాష్ట్రంలో బుధవారం కూడా భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ 10 జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' హెచ్చరికలు జారీ చేయగా, మిగిలిన జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపింది. ఇక గురువారం, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి జల్లులు కురిసే అవకాశముందని అంచనా వేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్ మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్.ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో అత్యధికంగా 5.8 సెం.మీ వర్షం కురిసింది. తాంసి, తలమడుగు, ఇచ్చోడ, భోరజ్, మావల మండలాల్లో 4.2 సెం.మీకి పైగా వర్షపాతం నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 4 సెం.మీ వర్షం పడగా... జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు నమోదయ్యాయి. రాష్ట్రంలో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ (ఔఆఖీఈ) బృందాలను సిద్ధంగా ఉంచామని, అవసరాన్ని బట్టి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా సహాయక బృందాలను ప్రభావిత ప్రాంతాలకు తరలిస్తామని సీఎస్ వెల్లడించారు.

### ఏపీలో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం రోజున వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ంఖూఆఓం) వెల్లడించింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడొచ్చని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటితో పాటు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, కృష్ణా, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి జల్లులు పడొచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. వర్షాల సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... ముఖ్యంగా చెట్లు, ప్రకటనల హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడకుండా సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని హెచ్చరించింది.

### ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

## ఆట



# వైభవ్ సూర్యవంశీపై వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు

జింబాబ్వేతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 49 బంతుల్లో 81 పరుగులు చేసి జట్టు ఘనవిజయంలో కీలక పాత్ర పోషించాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ గెలుచుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను కూడా కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం భారత తాత్కాలిక ప్రధాన కోచ్ వివిఎస్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం 15 సంవత్సరాల వయస్సులోనే వైభవ్ చూపుతున్న ఆత్మవిశ్వాసం, పరిణతి అద్భుతమని కొనియాడిన లక్ష్మణ్, భవిష్యత్తులో అతను మరింత ఎదగడానికి ఓ కీలకమైన సలహా ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభను బీసీసీఐ రెండున్నర సంవత్సరాల క్రితమే గుర్తించిందని లక్ష్మణ్ వెల్లడించారు. 2024 అండర్–19 ప్రపంచ కప్‌కు ముందు విజయవాడలో జరిగిన క్వాడ్రాంగ్యులర్ సిరీస్‌లో ఇండియా–బి తరఫున వైభవ్ అత్యధిక పరుగులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచే అతనికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్యాంపుల్లో శిక్షణ ఇస్తూ, అండర్–19 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. వైభవ్ ఒక ఆటగాడిగానే కాకుండా వ్యక్తిగతంగా ఎలాంటి ఆలోచనా ధోరణి కలిగి ఉంటాడో మేనేజ్‌మెంట్‌కు పూర్తిగా తెలుసని లక్ష్మణ్ చెప్పారు. గత ఆరు నెలల కాలంలో వైభవ్ వ్యక్తిగతంగా ఎదిగిన తీరు, ఆటపై అతనికి ఉన్న అవగాహన, మెచ్యూరిటీ లెవల్స్ ఆకాశాన్ని తాకాయని లక్ష్మణ్ ప్రశంసించారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద బౌలర్లను ఎదుర్కొంటూ ఒత్తిడి సమయాల్లోనూ రాణించగలుగుతున్నాడని చెప్పారు. అయితే వైభవ్ ఇంకా చాలా మెరుగుపడాల్సిన ఏకైక ప్రధాన అంశం అతని ఓవరాల్ ఫిట్‌నెస్ అని లక్ష్మణ్ స్పష్టం చేశారు. అతను ఇంకా 15 ఏళ్ల చిన్న కుర్రాడేనని, రాబోయే రోజుల్లో తన ఫిట్‌నెస్ స్థాయిలను పెంచుకుంటే క్రికెట్ ప్రపంచంలో తిరుగులేని ప్లేయర్‌గా మారతాడని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.ఆటలోని ప్రతి విభాగంలోనూ తానను తాను మెరుగుపరుచుకోవాలనే తపన వైభవ్‌లో స్పష్టంగా కనిపిస్తుందని కోచ్ లక్ష్మణ్ కొనియాడారు. మూడో టీ20 మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దెబ్బ తగిలి గాయపడినప్పటికీ, మైదానాన్ని వదిలి వెళ్లకుండా జట్టు కోసం ఫీల్డింగ్ కొనసాగించాలని వైభవ్ భావించాడని తెలిపారు. కానీ జట్టు ఫిజియో వచ్చి బలవంతంగా అతనిని బయటకు తీసుకువెళ్లారని చెప్పారు. చిన్న వయసులోనే జట్టు విజయం కోసం అతను చూపించిన ఈ అంకితభావం, పట్టుదల నిజంగా అభినందనీయమని లక్ష్మణ్ ప్రశంసించారు.



# సరికొత్త ఓపెనర్స్‌తో బరిలోకి టీమిండియా..?

భారత క్రికెట్ వర్గాల్లో పదిహేనేళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. జింబాబ్వే టూర్‌లో అదరగొట్టిన ఈ టీనేజ్ సెన్సేషన్‌ను 2027 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దించాలని మాజీ దిగ్గజం ఫరూఖ్ ఇంజనీర్ సంచలన సూచన చేశారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెంటనే ఈ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేయడం ఆసక్తికరంగా మారింది.వన్డే ప్రపంచకప్ 2027 టార్గెట్‌గా టీమిండియా సన్నాహాలు మొదలుపెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఫరూఖ్ ఇంజనీర్ చేసిన వ్యాఖ్యలు జాతీయ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం భారత వన్డే జట్టులో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఇన్నింగ్స్ ఆరంభిస్తున్నారు. అయితే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ వ్యూహాన్ని మార్చాలని ఆయన సూచించారు. గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మాట వాస్తవమే అయినా.. అతడిని నాలుగో స్థానంలో ఆడిస్తే జట్టుకు మరింత మేలు జరుగుతుందన్నది ఫరూఖ్ అభిప్రాయం. గిల్ గాల్లోకి లేపి భారీ షాట్లు ఆడే రకం కాదు.. అతడో పక్కా క్లాస్ ప్లేయర్ కాబట్టి అతనికి మిడిలార్డర్ బాధ్యతలు అప్పగించాలన్నారు.అదే జరిగితే కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంటుంది. మైదానంలో ఈ లెఫ్ట్–రైట్ కాంబినేషన్ అద్భుతంగా వర్కవుట్ అవుతుందని ఆయన విశ్లేషించారు. వైభవ్ లాంటి దూకుడున్న ఆటగాడు పవర్‌ప్లేలో ఫీల్డింగ్ గ్యాప్స్ సునాయాసంగా కనుక్కుని బౌండరీలు బాదగలడు. అతడు ఆరంభంలోనే వేగంగా పరుగులు రాబడితే.. మిగతా బ్యాటర్లు కుదురుకుని భారీ లక్ష్యాలను నిర్దేశించడానికి పుష్కలంగా సమయం దొరుకుతుంది.ఫరూఖ్ సూచించిన కొత్త బ్యాటింగ్ లైనప్ ప్రకారం.. రోహిత్, సూర్యవంశీ ఓపెనింగ్ చేస్తే.. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ తనకిష్టమైన మూడో స్థానంలోనే వస్తాడు. ఆ తర్వాత నాలుగో నంబర్‌లో శుభ్‌మన్ గిల్ వస్తే టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ అత్యంత పటిష్టంగా మారుతుంది. పటిష్టమైన బేస్ ఏర్పడ్డాక మిడిలార్డర్‌లో గిల్ లాంటి సాంకేతిక నైపుణ్యం ఉన్న బ్యాటర్ ఉంటే జట్టుకు తిరుగుండదని ఫరూఖ్ అంచనా వేస్తున్నారు.ఇటీవలే జింబాబ్వేతో ముగిసిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో వైభవ్ ఏ స్థాయిలో చెలరేగాడో అందరం చూశాం. రెండు అద్భుతమైన హాఫ్ సెంచరీలు సాధించి మొత్తం 151 పరుగులు ఖాతాలో వేసుకున్నాడు.

# వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్‌కు రజతం

కామన్వెల్త్ గేమ్స్?లో భారత్? ఖాతాలో ఐదో పతకం చేసింది. వెయిట్?లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్? సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం జరిగిన మహిళల 53 కేజీల విభాగం వెయిట్?లిఫ్టింగ్?లో రెండో స్థానంలో నిలిచిన జ్ఞానేశ్వరికి రజతం దక్కింది. ఈ పోటీలో తొలి స్థానంలో నిలిచిన ఒనోమి ఒమోలోల (నైజీరియా) గోల్డ్ ముద్దాడగా, రెబెక (కెనడా)కు కాంస్యం దక్కింది. ఈ పోటీలో జ్ఞానేశ్వరీ అద్భుత పోరాట పటిమ కనబర్చింది. అయితే కేవలం 7 పాయింట్ల తేడాతో ఆమె స్వర్ణం మిస్ అయ్యింది. స్నాచ్?లో తొలి రెండు ప్రయత్నాల్లో 82, 85 కేజీల బరువు ఎత్తిని యాదవ్ మూడో ప్రయత్నంలో సక్సెస్?ఫుల్?గా 88 కేజీలు ఎత్తింది. ఇక క్లీన్ అండ్ జెర్క్?లో తొలి రెండుసార్లు 103, 105 కేజీలు ఎత్తగా, చివరి ప్రయత్నంలో 111 కేజీలు బరువుతో సత్తా చాటింది. దీంతో మొత్తం 199 కేజీలతో జ్ఞానేశ్వరి రెండో స్థానంలో నిలిచింది. ఇదే పోటీలో నైజీరియా వెయిట్ లిఫ్టర్ ఒనమి ఒనోమోల స్నాచ్?లో ఏకంగా 93 కేజీలు ఎత్తింది. ఇక ఇక క్లీన్ అండ్ జెర్క్?లోనూ సత్తా చాటుతూ 113 కేజీలు ఎత్తింది.

# సన్న బియ్యం అర్హులకే అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ

## బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్‌కు తావివ్వొద్దు: అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29

జిల్లాలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం అర్హులైన బీపీఎల్ కుటుంబాలు, విద్యాసంస్థలకు మాత్రమే చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన, బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలు, బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్ జరగకుండా నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం 2025 ఏప్రిల్ 1 నుంచి అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డులోని ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్యం, అంత్యోదయ కార్డుకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని 14 మండలాల పరిధిలో 410 చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,46,981 రేషన్ కార్డుల ద్వారా 7,17,898 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతుండగా, కొత్తగా 30,909 రేషన్ కార్డులు మంజూరు చేసి 88,357 మంది లబ్ధిదారులను చేర్చినట్లు వెల్లడించారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల కోటా కింద జిల్లాకు 13,645.968 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం 43 ఫెయిర్ ప్రైస్ షాపుల డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతి రేషన్ కార్డుదారుడి ఈ-కేవైసీ ప్రక్రియను జూలై 31లోపు వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 7,16,498 మంది లబ్ధిదారుల్లో ఇప్పటికే 5,89,738 మంది (82.31 శాతం) ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని, మిగిలిన వారు కూడా గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో గుర్తించిన 7,490 మంది అనుమానిత లబ్ధిదారుల్లో 4,894 మంది ధృవీకరణ పూర్తయిందని, మిగిలిన వారి వివరాల పరిశీలనను వేగవంతం చేయాలని సూచించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన 62 కేసుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన 31 కేసుల్లో 579.80 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రూ.25.89 లక్షల విలువైన నిల్వలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ఎల్పీజీకి సంబంధించిన 31 కేసుల్లో 45 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,18,953 అర్హ కుటుంబాలకు ఇప్పటివరకు 4,73,691 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి రూ.1,403.45 లక్షల సబ్సిడీ అందించినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ శ్రీకాంత్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## శాఖాంబరిగా దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

### గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, భక్తులతో కిటకిటలాడిన ఆలయం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29



గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో శాఖాంబరి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శాఖాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి విశేషంగా ఆకట్టుకున్నారు.ఆలయ అర్చకుడు మారుపాక ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటలకు అమ్మవారికి అభిషేకం నిర్వహించి, అనంతరం అర్చన అనంతరం శాఖాంబరి అలంకారం చేశారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారు శాఖాంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.అనంతరం నిర్వహించిన శ్రీ లలితా సహస్రనామ పారాయణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు భజన కార్యక్రమం నిర్వహించగా, అనంతరం పవళింపు సేవలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మారుపాక ప్రశాంత్ శర్మ మాట్లాడుతూ, దుర్గముడు అనే రాక్షసుడి బారి నుంచి సమస్త జీవకోటిని రక్షించేందుకు ఆదిపరాశక్తి శాఖాంబరి అవతారాన్ని ధరించిందని, శ్రీదేవీ భాగవతంలోని సప్తమ స్కంధంలో ఈ విశిష్టత ప్రస్తావించబడిందని తెలిపారు. దేవి అనుగ్రహించిన తొమ్మిది అవతారాల్లో శాఖాంబరి అవతారం కూడా ఒకటిగా పురాణాలు పేర్కొంటున్నాయని వివరించారు.

## ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలి

### రామగిరి ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేసిన ఉద్యోగులు



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29

పెద్దపల్లి జిల్లా రామగిరి మండల ఎంపీడీఓ బద్రి శైలజారాణికి గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న ఎస్ఆర్‌డీఎస్ (వీబీజీ రామ్‌జీ), ఎన్‌టీఈ ఉద్యోగులు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలను విడుదల చేయడంతో పాటు 2026 ఆగస్టు 15 నాటికి నూతన హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం, పే స్కేల్, గ్రేడ్ పే, పదోన్నతులు, ట్రావెల్ అలవెన్సులు, బడ్జెట్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే ఆగస్టు 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, తీవ్రస్థాయి ఆందోళనలు చేపడతామని ఎస్ఆర్‌డీఎస్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ట్రెజరర్ కొండ సత్యనారాయణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ట్రెజరర్ కొండ సత్యనారాయణ, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వి. మౌనిక, సాంకేతిక సహాయకులు మల్క అఖిల, నేరెళ్ల సుప్రియ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ సీఐ సస్పెన్షన్..

హైదరాబాద్, జూలై 29

న్యాయం చేస్తారని నమ్మి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళని లొంగదీసుకున్నాడు ఓ సీఐ. ఆపై ఆమెతో లైంగిక అవసరాలు తీర్చుకుని, వీడియోలు తీసి వేధిస్తున్నట్లుగా తేలడంతో పోలీస్ శాఖ ఆ సీఐపై వేటు వేసింది. మహిళ వీడియోలు అడ్డం పెట్టుకొని డబ్బులు గుంజుతున్నట్లు గుర్తించిన పోలీసులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ సస్పెన్షన్ వేటు వేశారు. విధి నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడంతో పాటు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన కేవలం 4 నెలల్లోనే ఆయన సస్పెండ్ కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.తనకున్న సమస్యపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితురాలికి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయంలో తన మొబైల్‌లో ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా తనపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని, ఆపై అబార్షన్ కూడా చేయించాడని బాధితురాలు తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది. తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.బాధితురాలి నుంచి వచ్చిన ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు సీఐ శ్రీనివాసులు రెడ్డిపై శాఖా పరంగా అంతర్గత విచారణకు ఆదేశించారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను శ్రీనివాసులురెడ్డి ఖండించారు. బాధితురాలిగా చెప్పుకుంటున్న మహిళే తనను బెదిరించి పలుమార్లు డబ్బులు వసూలు చేసిందని ఆయన ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం కమిషనర్ సజ్జనార్ సీఐ శ్రీనివాసులు రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

## జూరాల ప్రాజెక్టును సందర్శించిన నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జూలై 29

ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు నీళ్లు ఇస్తారనే ధీమాతోనే ఆంధ్రప్రదేశ్ రైతులు పంటలు సాగు చేస్తున్నారని బీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డిలతో కలసి ఈరోజు జూరాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆత్మకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి స్థానిక కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయకుండా తెలంగాణ రైతులను గోస పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. "రేవంత్ రెడ్డి ఎట్లయినా సరే ఆంధ్రకు నీళ్లు తరలిస్తారన్న ముందస్తు నమ్మకంతోనే అక్కడి రైతులు ధైర్యంగా విత్తనాలు వేసుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి ఏపీ ప్రజలపై ఉన్న ప్రేమ, ఇక్కడి తెలంగాణ రైతాంగంపై లేదనడానికి జూరాల కాలువల నిర్లక్ష్యమే నిదర్శనమని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు.

## పులులను కాపాడితేనే ప్రకృతి సమతుల్యత..

### జైపూర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ.



అర్జున్ సమాచారం జులై 29 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:

మంచిర్యాల జిల్లా జైపూర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి అటవీ విభాగాధికారి సర్వేశ్వర్, అటవీ పరిధి అధికారి రత్నాకర్, విభాగాధికారి రామకృష్ణ, అటవీ సంరక్షకురాలు వసంతలక్ష్మి, అటవీ సంరక్షకుడు కె. రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుండి సేవలందించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు పులుల సంరక్షణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే నాటికలు, గేయాలు, సాంస్కృతిక నృత్యాలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు బహుమతులు అందజేసి అభినందించారు.కళాశాల ప్రధానోపాధ్యాయురాలు కె. ఫణిబాల మాట్లాడుతూ, విద్యార్థుల్లో వన్యప్రాణుల సంరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు అటవీ శాఖ చేపట్టిన కార్యక్రమం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవంతానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పులులను, అడవులను పరిరక్షించి ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## లద్నాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలోకి భారీగా వరదనీరు

### డ్రైనేజీ సమస్యతో చెరువును తలపిస్తున్న కాలనీ.. ఐదేళ్లుగా పరిష్కారం లేదని గ్రామస్తుల ఆవేదన

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29:

రామగిరి మండలంలోని లద్నాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో గురువారం కురిసిన భారీ వర్షానికి వరదనీరు భారీగా చేరి కాలనీ చెరువును తలపించింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచి, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రత్నాపూర్, పన్నూరు గ్రామాల పరిధిలోని భూనిర్వాసితుల కోసం సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన లద్నాపూర్ పునరావాస కేంద్రంలో ఇప్పటికే పలువురు కుటుంబాలు ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటుండగా, మరికొన్ని ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. పునరావాస కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో డ్రైనేజీ వ్యవస్థతో పాటు మరికొన్ని మౌలిక వసతుల పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని స్థానికులు తెలిపారు.ప్రస్తుతం వర్షపు నీరు, డ్రైనేజీ నీరు కలిసిపోవడంతో కాలనీలో నీరు నిలిచిపోయి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, దోమలు, విషపురుగులు, పాముల సంచారం పెరిగి చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.గత ఐదేళ్లుగా పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని, హామీలకే పరిమితమవుతున్నారని వారు వాపోయారు. సింగరేణి సంస్థ కోసం తమ గ్రామాలను వదిలి పునరావాస కాలనీకి వచ్చిన తమను ఇలాంటి సమస్యల్లో ఉంచడం సరికాదని పేర్కొన్నారు.ఇప్పటికైనా సింగరేణి ఆర్జీ-3 జీఎం, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి డ్రైనేజీ సమస్యతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని లద్నాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు.



## భారీ వర్షాలపై జగిత్యాల జిల్లా పోలీసుల అప్రమత్తత.



జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం జులై 29::


వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన.. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అలాగే వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, నీరు నిలిచే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి రాకపోకలను పునరుద్ధరించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో తాత్కాలిక హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కల్వర్టులను ప్రజలు దాటకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో గ్రామస్తులు అడవి ప్రాంతాలకు వెళ్లకుండా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని, గోదావరి పరివాహక మండలాల్లో నదీ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. వర్షాల సమయంలో చేపల వేట, ఈత, వరద నీటిలోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, గతంలో వరదలతో ప్రభావితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు.ప్రతి పోలీసు వాహనంలో తాళ్లు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయ్‌లు లేదా టైర్ ట్యూబులు వంటి అత్యవసర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని, విధుల్లో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది తప్పనిసరిగా రెయిన్‌కోట్లు వెంట తీసుకెళ్లాలని ఆదేశించారు.విద్యుత్ తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వంటి ఘటనలు గుర్తించిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలని సూచించారు. మూసుకుపోయిన డ్రైనేజీలను రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని జేసీబీల సహాయంతో వెంటనే శుభ్రం చేయించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భారీ వర్షాల సమయంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనీయవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలోకి వరద నీరు

### రత్నాపూర్‌లో నాలా పొంగిపొర్లడంతో విద్యార్థులకు సెలవు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29

రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలోకి బుధవారం వరద నీరు భారీగా చేరింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పాఠశాల పక్కనే ఉన్న నాలా పొంగిపొర్లడంతో వరద నీరు పాఠశాల ఆవరణలోకి ప్రవహించింది.సెంటినరీ కాలనీ, రామ్‌నగర్, లద్నాపూర్ పాత, కొత్త ప్లాట్లు, రామగిరి ఖిల్లా ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఇదే నాలా గుండా ప్రవహించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పాఠశాల ప్రాంగణమంతా నీటితో నిండిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, గ్రామ కార్యదర్శి గంగుల సంతోష్ పాఠశాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలకు సెలవు ప్రకటించారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# లద్నాపూర్‌లో వరద నీటి సమస్యకు తక్షణ చర్యలు

### జేసీబీతో నీటి ప్రవాహానికి మార్గం ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29

రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు లద్నాపూర్ గ్రామంలో వరద నీరు చేరడంతో గ్రామపంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలోకి చేరిన వరద నీరు నిల్వ ఉండకుండా జేసీబీ సహాయంతో నీరు వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ వనం రాంచందర్ రావు పర్యవేక్షించారు. నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించి, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అడ్డూరి శ్రీకాంత్, వార్డు సభ్యులు మల్లారపు స్వామి, అడ్డూరి శైలజ--సురేష్, గ్రామ కార్యదర్శి సతీష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొని సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారు. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేకుండా వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు.

# గురు పౌర్ణమి వేళ మంథని షిరిడి సాయిబాబా ఆలయంలో భక్తి వెల్లువ

### పాదదర్శనం, గురుదక్షిణ, అన్నదానం, భజనలతో ఆధ్యాత్మిక వేడుకలు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29



గురు పౌర్ణమి సందర్భంగా మంథని పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం భక్తి పారవశ్యంతో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే సద్గురు షిరిడి సాయినాథుని ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు సాయినాథుని పవిత్ర పాదాలను దర్శించుకునే ప్రత్యేక అవకాశం కల్పించారు. అనంతరం భక్తులు గురుదక్షిణ సమర్పించి సద్గురువు ఆశీస్సులు పొందారు.



గురు పాదసేవ ద్వారా సద్గురువు అనుగ్రహం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు మహాప్రసాదాన్ని అందజేశారు. అన్నదాన సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిసేవలో భాగస్వాములయ్యారు. సాయంత్రం యోగిరాజ శతక పారాయణం నిర్వహించగా, అనంతరం సాయినామ సంకీర్తనలతో భజన కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. చివరగా జరిగిన శేజ హారతిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సాయినాథుని కృపాకటాక్షాలను ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పనకంటి మురళీధర్, ఆలయ అర్చకుడు రామడుగు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా భక్తులకు అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించడం ఆనందంగా ఉందన్నారు. లోకక్షేమం, సర్వజన సుఖశాంతులు, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని సద్గురు సాయినాథుని ప్రార్థించినట్లు తెలిపారు.

# భారీ వర్షాలకు విద్యుత్ స్తంభం విరగడంతో అప్రమత్తమైన విద్యుత్ శాఖ

### వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29

రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మెయిన్ రోడ్డువద్ద ఉన్న విద్యుత్ స్తంభం విరిగి కిందపడింది. దీంతో ప్రమాద పరిస్థితి ఏర్పడగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే లైన్‌మన్ వడ్లకొండ రమేష్, ఏఎల్ఎం కందుల అంజి, ఏఎల్ఎం బండి శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని మరమ్మత్తు పనులు చేపట్టారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా పునరుద్ధరించారు. సమస్యపై వెంటనే స్పందించి మరమ్మతులు పూర్తి చేసిన విద్యుత్ శాఖ సిబ్బందికి గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమరయ్య, ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ పుల్లెల సతీష్, కలవేన సదానందం ముదిరాజ్, ఉగ్గే నవీన్, కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించడం అభినందనీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.



# మంథని ప్రభుత్వ ఆస్పత్రికి నియమితులైన నూతన వైద్యులు మంత్రి శ్రీధర్ బాబును కలిసారు

### నాణ్యమైన వైద్యం అందించి ప్రసూతి సేవలను మరింత బలోపేతం చేయాలని సూచన

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29

మంథని ప్రభుత్వ ఆస్పత్రికి ఇటీవల తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ద్వారా నియమితులైన గైనకాలజిస్ట్ డాక్టర్ మామిడిపల్లి స్రవంతి, అనస్థీషియా స్పెషలిస్ట్ డాక్టర్ గుంట మౌనిక రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంథని ప్రభుత్వ ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మంత్రికి పూల మొక్కను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్‌తో పాటు గైనకాలజిస్ట్, అనస్థీషియా స్పెషలిస్ట్ వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మంథని ప్రభుత్వ ఆస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించిందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని సూచించారు. మాతా--శిశు ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రసూతి సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని, మంథని పరిసర గ్రామాల నుంచి వచ్చే గర్భిణుల కేసులను సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందించేలా చూడాలని సూచించారు. సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇటీవల ఆస్పత్రిలో నియమితులైన డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ పూర్ణిమ అందిస్తున్న దంత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఆస్పత్రి అభివృద్ధి, వైద్య సేవలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు.



# వాడవాడలా తిరుగుతూ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ-భీమారం సర్పంచ్ విజయలక్ష్మి

భీమారం(మంచిర్యాల), అర్జున్ సమాచారం, జూలై 28 .



గత కొన్ని రోజులుగా భీమారంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలువలు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. నాలీలు చెత్త తో కూడుక పోయి నీరు రోడ్లపైకి చేరడంతో పాటు, లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లను వరద నీరు చుట్టుముట్టింది. ఈ పరిస్థితిపై స్థానిక ప్రజల నుండి విజ్ఞప్తులు రాగానే భీమారం సర్పంచ్ విజయలక్ష్మి వెంటనే స్పందించారు. సర్పంచ్ విజయలక్ష్మి స్వయంగా వర్షంలో తడుస్తూ గ్రామంలోని వాడవాడలా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలు చేపట్టారు. వరద నీరు నిలిచి ఇళ్లలోకి చేరే అవకాశం ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో సర్పంచ్ తక్షణమే జేసీబీ యంత్రాన్ని తెప్పించి కాలువలను తవ్వించారు. తద్వారా నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేసి ప్రమాదాన్ని తప్పించారు. అలాగే డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా వెంటనే తొలగింపజేశారు. నీరు నిలవకుండా నిరంతరం ప్రవహించేలా చర్యలు తీసుకుంటూ సర్పంచ్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రత్యక్షంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టిన సర్పంచ్ విజయలక్ష్మి చొరవను గ్రామ ప్రజలు విశేషంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మితో పాటు భీమారం మండల ఎంపిడిఓ వీణ ,ఎంపిఓ సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఉస్కమల్ల పున్నం చందు, ఉస్కమల్ల శ్రీనివాస్, కోట రవి,ఆవుల సురేష్ ,గుడిమల్ల నరహరి, మొదలగు ప్రజా ప్రతి నిధులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి పరిశీలించారు. గోదావరిఖని మల్కాపూర్, మెడికల్ కళాశాల, 5 ఇంక్లైన్ తదితర ప్రాంతాల్లో నాలాలు పొంగిపొర్లి రోడ్డుపైకి నీరు రావడంతో పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్, మేయర్ మహంకాళి స్వామి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు, నదుల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లరాదని సూచించారు. వర్షాల కారణంగా రహదారులపై వాహనాలు జారిపోయే ప్రమాదం ఉన్నందున పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని తెలిపారు. పిల్లలు, యువత సెల్ఫీలు తీసుకోవడానికి లేదా ఈత కొట్టేందుకు నదులు, చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీసీపీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఎలాంటి సహాయం అవసరమైనా వెంటనే 100కు లేదా స్థానిక పోలీసు అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



# కొండగట్టు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మంత్రి అడ్లూరి..

జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం జులై 29::

గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా గిరి ప్రదక్షిణలు మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆంజనేయస్వామి చూడాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక





# పండంటి ఆడబిడ్డకి జన్మనిచ్చిన 'సామజవరగమనా' హీరోయిన్ ..

తెలుగు ప్రేక్షకులకు 'సామజవరగమనా' సినిమాతో ఎంతో దగ్గరైన హీరోయిన్ రెబా మోనికా జాన్ అభిమానులకు శుభవార్త చెప్పింది. జూలై 22న ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంతోషకరమైన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్న రెబా, తమ చిన్నారి పేరును కూడా వెల్లడించింది. తమ గారాలపట్టి పేరు 'కియారా జోసెఫ్' అని ప్రకటించింది. ఈ సందర్భంగా రెబా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ పోస్ట్ చేసింది. "హలో వరల్డ్... మా చిన్నారి కియారా జోసెఫ్‌కు హాయ్ చెప్పండి. మా జీవితాల్లోకి వచ్చిన చిన్న సూర్యకిరణం తను. గత కొద్ది రోజులుగా ఈ కొత్త అనుభూతిని ఆస్వాదిస్తూ, మా చిన్నారిని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాం. ఒక మహిళ శరీరం మరో ప్రాణానికి జన్మనివ్వడం నిజంగా ఓ అద్భుతం. గత తొమ్మిది నెలలుగా తనతో గడిపిన ప్రతి క్షణం ఎంతో ప్రత్యేకం" అంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంది.



# ఇదే నిజమైన విజయం

'నాకు పర్సనల్‌గా ప్రేమకథలంటే చాలా ఇష్టం. కోవిడ్ తర్వాత లవ్‌స్టోరీస్ తగ్గిపోతుంటే బాధపడ్డాను. మళ్లీ ఇప్పుడు ట్రెండ్ మొదలైంది. 'చెన్నై లవ్‌స్టోరీ'తో మరో కల్ట్ లవ్‌స్టోరీ ఇండస్ట్రీకి దక్కింది' అన్నారు హీరో నాగచైతన్య. మంగళవారం జరిగిన 'చెన్నై లవ్‌స్టోరీ' సక్సెస్‌మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించగా.. ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మించారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను కోరుకునే ప్రేమకథను చూశానని, ఎంతో పరిణితితో రాసిన స్టోరీ ఇదని, పోస్టర్ మీద కలెక్షన్స్ నెంబర్స్ వేయడం కంటే ఇదే నిజమైన విజయంగా భావిస్తానని చెప్పారు. ఈ సినిమాలోని ఎమోషన్స్‌తో పాటు క్యారెక్టర్స్‌కు ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతున్నారని, నాగచైతన్యను చూస్తే తన మంచికోరే అన్నలా అనిపిస్తారని కిరణ్ అబ్బవరం ఆనందం వ్యక్తం చేశారు. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'నాలుగు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అయింది. మూడురోజుల్లో 40.1కోట్ల రూపాయల వసూళ్లు దక్కాయి. బ్లాక్‌బస్టర్ కాదు..అంతకుమించి సక్సెస్ సాధించింది' అన్నారు. సోమవారం వసూళ్లు చూశాక ఈ సినిమాను ప్రేక్షకులు ప్రేమిస్తున్నారని అర్థమైందని నిర్మాత, చిత్ర రచయిత సాయిరాజేష్ సంతోషం వ్యక్తం చేశారు. తనకు నిజమైన కెరీర్‌ని ఇచ్చిన చిత్రమిదని, ప్రేక్షకులు ఇంతటి ప్రేమను చూపిస్తారని అస్సలు ఊహించలేదని కథానాయిక శ్రీగౌరిప్రియ పేర్కొన్నది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# నచ్చని వారికి దూరంగా ఉండాలి.. ట్రోల్స్ గురించి పట్టించుకోవద్దు..

ప్రతి ఏడాది ఆనవాయితీ ప్రకారం నిర్వహించే అభిమానుల భేటీలో అగ్ర హీరో అల్లు అర్జున్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ట్రోల్స్ గురించి, అభిమానుల మధ్య ఫ్యాన్‌వార్స్ గురించి ఆయన తన అభిప్రాయాల్ని వెల్లడించారు. మనకు నచ్చని వాళ్లని వదిలేయాలని, వారి కోసం ఏమాత్రం సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. 'నా అభిమానులతో పాటు నన్ను ద్వేషించే ట్రోలర్స్‌కి కూడా ఈ విషయం ఎప్పటి నుంచో చెబుదామనుకుంటున్నా. ప్రతీ రోజు మనలో ఉండే వంద శాతం ఎనర్జీని ఎందుకోసం వాడుకుంటామనేది చాలా ముఖ్యం. ఎవరైనా నచ్చకపోతే వారిని ద్వేషిస్తూ, ట్రోల్ చేస్తూ సమయాన్ని వృథా చేసుకోవద్దు. మనకు నచ్చని వారి కోసం డబ్బులు ఖర్చు పెడతామా? అలాగే నచ్చని విషయాల కోసం మన టైమ్, ఎనర్జీని అస్సలు ఖర్చు పెట్టొద్దు. ఆ సమయాన్ని మన అభివృద్ధి కోసం వినియోగించుకోవాలి. నచ్చిన పనిచేస్తూ ముందుకువెళ్లాలి. నీకు నచ్చిన అమ్మాయి ఇంటి ముందు నిలబడు. కనీసం ఆ కాస్త సమయాన్నైనా నువ్వు ఎంజాయ్ చేస్తావు' అని అల్లు అర్జున్ అన్నారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.




# ప్యారడైజ్‌లో ప్రత్యేకగీతం


సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంటాయి. అలాంటి వాటిలో నాని–కీర్తిసురేష్ కాంబో ఒకటి. ఇప్పటికే ఈ జోడీ నేను లోకల్, దసరా వంటి హిట్ చిత్రాల్లో ప్రేక్షకుల్ని అలరించారు. తాజాగా ఈ జంట మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ ఓ ప్రత్యేకగీతంలో నర్తిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో వేసిన ఓ స్పెషల్ సెట్‌లో ఈ పాటతో పాటు కొన్ని సన్నివేశాలను నాని–కీర్తిసురేష్‌లపై తెరకెక్కిస్తున్నారని సమాచారం. 'దసరా' చిత్రంలో పల్లెటూరి అమ్మాయి వెన్నెల పాత్రలో కీర్తిసురేష్ అభినయం అందరిని ఆకట్టుకుంది. నానితో ఆమె కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో మరోమారు ఈ భామ నానితో కలిసి నటిస్తుండటం విశేషం. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నది. సికింద్రాబాద్ నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు.



# వారణాసి స్వర ప్రయాణం

ఆస్కార్ విజేత, ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ప్రస్తుతం 'వారణాసి' సినిమా పాటల పనిలో బిజీగా ఉన్నారు. సినిమాకు పాటలు ముఖ్యమే. కానీ నేపథ్య సంగీతం అంతకంటే ముఖ్యం. సన్నివేశాల్లోని గాఢత మరింత ఎలివేట్ అవ్వాలంటే, అందుకు తగ్గ నేపథ్య సంగీతం అమరాలి. మరీ ముఖ్యంగా రాజమౌళి లాంటి దర్శకుల చిత్రాల్లో అయితే.. నేపథ్య సంగీతం పాత్ర మరింత ఎక్కువ ఉంటుంది. అయితే.. ఇప్పటివరకూ కీరవాణి 'వారణాసి' సినిమా నేపథ్య సంగీతం పనులు మొదలుపెట్టలేదు. తాజా చిట్‌చాట్‌లో ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు కీరవాణి. సెప్టెంబర్ నుంచి ఆర్ఆర్ పనులు మొదలుపెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రతిష్టాత్మక 'వారణాసి' బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం నాలుగు నెలలు కేటాయించినట్టు కీరవాణి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి కల్లా 'వారణాసి' నేపథ్య సంగీతం పనులను పూర్తి చేస్తానని ఆయన తెలిపారు.





## నిద్రపోతున్న కుటుంబంపై కూలిన ఇంటి పైకప్పు!



**కోటపల్లి(మంచిర్యాల), అర్జున్ సమాచారం, జూలై 29:**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో అర్ధరాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని ఆలుగామ గ్రామంలో వర్షాల తాకిడికి ఓ ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోవడంతో, ఇంట్లో నిద్రిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆలుగామ గ్రామానికి చెందిన ఆత్రం మాంతయ్య, ఆయన భార్య లక్ష్మి తమ ఇద్దరి పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తెల్లవారుజామున ఆకస్మికంగా ఇంటిపై ఉన్న రేకులు ఒక్కసారిగా వారిపై కూలిపడ్డాయి. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులంతా గాఢ నిద్రలో ఉండటంతో, అప్రమత్తమయ్యే అవకాశం లేక నలుగురికీ గాయాలయ్యాయి. ఈ ఘటనలో భార్య లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా, భర్త మాంతయ్య మరియు ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద శబ్దం విని వెంటనే గమనించిన స్థానికులు '108' అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి, తక్షణమే మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## భీమారం పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు రెయిన్ కోట్ల పంపిణీ



**భీమారం(మంచిర్యాల), అర్జున్ సమాచారం, జూలై 29:**

భీమారం గ్రామ పంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ల (పంచాయతీ సిబ్బంది) కు బుధవారం సర్పంచ్ విజయలక్ష్మి ఉచితంగా రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, వానలో సైతం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న పంచాయతీ వర్కర్ల ఆరోగ్య దృష్ట్యా ఈ రెయిన్ కోట్లను అందజేసినట్లు తెలిపారు. వర్షంలో తడుస్తూ పనిచేయడం వల్ల వ్యాధుల బారిన పడకుండా, పూర్తి భద్రతతో విధులకు హాజరయ్యేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమారం గ్రామ సర్పంచ్ విజయలక్ష్మితో పాటు పంచాయతీ కార్యదర్శి పెద్దపల్లి మల్లేశ్, స్థానిక నాయకులు, ప్రతినిధులు ఉస్కమల్ల చందు, శ్రీనివాస్, కోట రవి, ఆవుల సురేశ్, మార్నేని లచ్చన్న, గుడిమల్ల నరహరి, ప్రణీత్ గౌడ్, దారవేణి రమేశ్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలు వస్తేనే వాగులు గుర్తొస్తాయా..?

### ముందస్తు చర్యలు లేక హైవేపై వరద నీరు.. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు...

**అర్జున్ సమాచారం జులై 29 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:**

ముదిగుంట గ్రామపంచాయతీ, రసూల్‌పల్లి: రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు రసూల్‌పల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని నీరు సాఫీగా వెళ్లేలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో వరద నీరు తగ్గి వాహనాల రాకపోకలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నప్పటికీ, వాగులు, కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలను ముందస్తుగా శుభ్రపరచడంలో సంబంధిత వ్యవస్థ నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత మాత్రమే సమస్యలపై స్పందించడం కాకుండా, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలానికి ముందే నీటి ప్రవాహ మార్గాలను గుర్తించి పూడిక తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థల మరమ్మతులు చేపడితే ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# భారీ వర్షాల వేళ అప్రమత్తమే ప్రాణ రక్షణ..

## జైపూర్ మండల ప్రజలకు అధికారుల విజ్ఞప్తి -- వాగులు, చెరువులు, గోదావరి పరిసరాలకు దూరంగా ఉండాలి

**అర్జున్ సమాచారం జులై 29 మంచిర్యాల జిల్లా.ప్రతినిధి:**

జైపూర్ మండలం: నిన్న రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి జి. సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వర్షాల పరిస్థితిని పరిశీలించారు. మండల పరిధిలోని వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. వాగులు, చెరువులు, గోదావరి పరిసర ప్రాంతాలకు మత్స్యకారులు, గ్రామస్థులు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**రసూల్‌పల్లి వద్ద తక్షణ చర్యలు.**

రసూల్‌పల్లి సమీపంలో వాగు ఉద్ధృతంగా ప్రవహించి జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు స్పందించి యంత్ర సహాయంతో నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

**టేకుమట్ల, కుందారం వాగుల వద్ద రక్షణ చర్యలు**





టేకుమట్ల వాగు, కుందారం పెద్దవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తూ రహదారులను ముంచెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు, సంబంధిత గ్రామాల సర్పంచులు వెంటనే సంఘటనా స్థలాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వంతెనలపై నుంచి ఎవరూ దాటకుండా గ్రామపంచాయతీ సిబ్బందితో రక్షణ జాలీలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

మరో మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో రెండు నుంచి మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, విద్యుత్ తీగలు, పెద్ద చెట్లు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

**గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలి.**

గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామాల్లోనే అందుబాటులో ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మండల అభివృద్ధి అధికారి జి. సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, టేకుమట్ల సర్పంచ్ బల్ల వెంకటేష్, ముదిగుంట సర్పంచ్ ఆకుల రవికుమార్, పలు గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు టి. శ్రీనివాస్, పి. సురేష్, ఎల్. ప్రశాంత్, ఎం. విష్ణువర్ధన్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్డ్రన్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29**



సుల్తానాబాద్ మండలంలోని మార్కండేయ కాలనీలో ఉన్న చిల్డ్రన్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు గోడ దూకి వెళ్లిపోయిన ఘటన కలకలం రేపింది. చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, మిరియాల ఉమామహేశ్వరి (16), సుశీల ఆకృతి (8) మంగళవారం రాత్రి సమయంలో చిల్డ్రన్ హోమ్ ప్రాంగణంలోని గోడ దూకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి వారి ఆచూకీ తెలియరాలేదు. ఈ ఇద్దరు బాలికల గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే సుల్తానాబాద్ ఎస్ఐ 8712656511 లేదా సుల్తానాబాద్ సీఐ 8712656510 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 38 కేసుల్లో లభించిన 63.621 కిలోల గంజాయి,1 గంజాయి మొక్క దగ్ధం: కరీంనగర్ సిపి గౌస్ ఆలం

**కరీంనగర్. అర్జున్ సమాచారం ప్రతినిధి జులై 29.**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63 కిలోల 621 గ్రాముల గంజాయి మరియు 1 గంజాయి మొక్కను






ధ్వంసం చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో పోలీస్ కమీషనర్ సమక్షంలో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ జి.వెంకటస్వామి ఇన్స్పెక్టర్లు రఫీక్, శ్రీలత,ఆర్ఐలు రజినీకాంత్ , శ్రీధర్ రెడ్డి అలాగే ఇన్సినరేటర్ ప్లాంట్ కు చెందిన తిరుపతి మరియు ప్రభాకర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తమైన రామగుండం పోలీసులు

### వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 29**

మంచిర్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ అప్రమత్తమైంది. మంచిర్యాల జోన్ పరిధిలోని పాత మంచిర్యాల రాళ్లవాగు ప్రాంతాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా రాళ్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, వర్షాకాలంలో భద్రతకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కోటపల్లి, నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైతే ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించేందుకు సిద్ధంగా ఉన్నామని



వెల్లడించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 30 మంది శిక్షణ పొందిన సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ఏడాది వరదల సమయంలో గ్రామాలు నీటిలో చిక్కుకున్నప్పుడు బోట్ల సహాయంతో విజయవంతంగా సహాయక చర్యలు



చేపట్టామని గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఈ పరిశీలనలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.